# కొత్తదారి

-శిరంశెట్టి కాంతారావు

గయా క్షేత్రంలో పశ్చిమంగా సాగిపోతున్న ఫాల్గుణీ నదిలో స్నానం చేసిన మేము పిండ ప్రదానానికి సమయం మించిపోతుందన్న ఆతృతతో అటు శృంగేరీ మఠం నుంచి ఇటు అర్ధనారీశ్వర ఆలయం దాకా ఒకే పొడవునా నిర్మించిన మెట్లమీదుగా విష్ణుపాద ఆలయానికి వాయవ్యంలో విస్తరించి ఉన్న రావిచెట్టు కిందకు చేరుకున్నాం.

అక్కడ అప్పటికే అరవై, డెబ్బై మంది వ్యక్తులు మాలాగే స్నానాలు చేసి వచ్చి అర్ధవలయాకృతిలో రెండు వరుసలు తీరి కూర్చున్నారు.

కూర్చున్న ప్రతి వ్యక్తి ముందూ విస్తళ్ళలో పిండ ప్రదానానికి కావాల్సిన బియ్యప్పిండి, దర్భలు, ఆవు పాలు, పూలు, పళ్ళు, నల్లనువ్వులు, చిల్లర నాణాలు సర్దిపెట్టి ఉన్నాయి.

మాలాగే ఇంకా రావాల్సిన ఒకరిద్దరి కోసం ఎదురుచూస్తూ ఓ చిన్న గద్దెలాంటి పీట మీద కూర్చుని ఉన్నాడు పురోహితుడు అరుణాచార్య.

అరుణాచార్యకు యాభై ఏళ్ళుంటాయి. నిమ్మపండు రంగు దేహం మీద ఎర్రరంగు శాలువా వల్లెవాటు వేసుకుని తెల్లరంగు పేటంచు ధోవతీ కట్టుకున్నాడు. అర్ధముండనం చేయించుకుని చిన్న సిగముడి వేసుకున్నాడు. చెవులకు పెట్టుకున్న బంగారు కుండలాలు గాలికి ఊగుతున్నాయి. నుదుటి మీద తెల్లటి ఊర్ధ్వపుండ్రాలు దిద్దుకుని వాటి మధ్య ఎర్రటి నిలువుబొట్టు పెట్టుకున్నాడు. మెడలో రుద్రాక్ష మాల వేసుకుని, ముంజేతులకు బంగారు మురుగులు ధరించాడు. మొత్తంమీద అతణ్ణి చూస్తే ఎవరికైనా ఓ పూజ్య భావం కలుగుతుంది.

మరికొంతసేపు ఎదురు చూసిన తాను కార్య నిర్వహణకు సంసిద్ధుడవుతూ, "చూడండీ! మీ పితృదేవతల మోక్షాన్ని కాంక్షిస్తూ ఎక్కడో ఆంధ్ర దేశం నుంచి ఈ గయా క్షేత్రానికి ఎంతో ఖర్చుపెట్టుకుని వచ్చినందుకు ముందుగా మీ అందరినీ అభినందిస్తు న్నాను. పోతే, మన సాంప్రదాయంలో ఉత్తర కర్మలన్నీ ఎక్కడ నిర్వహించినా ఈ గయా క్షేత్రం పేరుమీదుగానే నిర్వహిస్తారు. ఈ గయా శ్రాద్ధం మీ పితృదేవతలకు మోక్షాన్నీ, మీకు పుణ్యాన్నీ కలుగజేస్తుంది" అంటూ స్పష్టమైన ఉచ్ఛారణతో కూడిన ఉరుములాంటి కంఠస్వరంతో గయా శ్రాద్ధ విశేషాలను వివరించ సాగాడు.

అక్కడున్న వాళ్ళంతా తను చెబుతుంది శ్రద్ధగా వింటున్నారని నిర్ధారించుకుని "ఈ గయా క్షేత్రానికి ఓ ప్రత్యేకత ఉంది. ఇక్కడి మొత్తం మూడుచోట్ల పిండ ప్రదానం చేసి, మీకిష్టమైన పత్రాన్ని, ఫలాన్ని, కాయనూ వదిలిపెట్టాల్సి ఉంటుంది. ఇప్పుడిక మీ ముందున్న బియ్యప్పిండిని ఆవుపాలతో పిసికి ముద్దలు చేసిపెట్టుకోండి" అంటూ వివరిస్తుండగానే విష్ణుపాద ఆలయంలో ఆరగింపు జరుగుతున్నట్టుగా మెలమెల్లగా మొదలైన ఓ గంటానాదం క్రమంగా ఉధృతమై పరిసరాలను ప్రతిధ్వనింపజేస్తూ ఫల్గుణీ నదీ తరంగాల మీదుగా ఎక్కడికో సాగిపోయింది.

జేగంటానాదం సద్దుమణిగిపోగానే "మీముందు

## శాశ్వత చరిత్ర

చరిత్ర ప్రతి మలుపులో
తిరుగుబాట్ల రక్త ప్రవాహం,
దుఃఖం ముగిసేచోట
వేదనారహిత స్థితి!
గతాన్ని గుదిబండలా మోయడమే
కొందరికి మిగిలిన వారసత్వం,
అవసరాల జారుడుబండపై
దిగజారే మనిషి
తోడేలుగా మారుతున్నాడు,
ప్రజాస్వామ్యం చుట్టూ
ఊసరవెల్లుల విజయోన్మాదం!
వర్తమాన చరిత్రలో
త్యాగాలన్నీ శిలాఫలకాలుగా
అయినా ఉప్పెనను
నిలదీయడమే
మన శాశ్వత చరిత్ర!

-నిఖిలేశ్వర్

విస్తళ్ళలో ఉన్న పవిత్రాలను (దర్భపోచల ఉంగరాలను) కుడిచేతి ఉంగరపు వేళ్ళకు ధరించండి" అంటూ ముఖానికి పట్టిన చిరుచెమటను ఉత్తరీయంతో మెల్లగా వత్తుకుంటూ మా అందరి వంకా పరిశీలనగా చూడసాగాడు అరుణాచార్య.

నేను, నాతో పాటు మరో ఒకరిద్దరు తప్ప చిత్రంగా మిగిలిన వాళ్ళెవరూ పవిత్రాలు పెట్టుకోకుండా ఒకరితో ఒకరు గుసగుసలాడుతూ అలాగే కూర్చున్నారు.

వాళ్ళ ప్రవర్తనకు ఒకింత కోపంతో "ఏమిటది? చెప్పింది చేయకుండా అలా గుసగుసలాడతారేమిటి?" అంటూ విసుక్కున్నాడు అరుణాచార్య.

అయినా, అదే పరిస్థితి. ఎవ్వరిలోనూ స్పందన లేదు.

మరో పావుగంట దాకా ఎదురు చూసినా ఎవ్వరూ నోరు మెదపలేదు. పవిత్రాలు ధరించలేదు. దాంతో కోపం స్థానంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది అరుణాచార్యలో.

లెక్కకు అందని పండ్లుగా, ఊహకు అందనంత మంది కర్మకాండలకు సాక్షీభూతంగా నిలిచిన ఆ గయా క్షేత్రమే ఈ సంఘటనతో విస్తుపోయినట్టుగా ఉంది.

మేము కూర్చున్న రావిచెట్టు కూడా ఊపిరి బిగబట్టి చూస్తున్నదా అన్నట్టు ఓ రెమ్మ కూడా కదలడంలేదు.

మూడు వందల అరవై రోజులూ మనుషుల మధ్యే తిరుగాడే అక్కడి గోమాతలు కూడా నెమరువేయడం మరచిపోయినట్టు శిలాప్రతిమల్లా ఎక్కడివక్కడే నిల్చుండిపోయాయి.

విషయం పొగమంచులా గయా క్షేత్రమంతా పాకిపోవడంతో ఎక్కడెక్కడినుంచో స్థానిక పాండాలంతా పరుగు, పరుగున పరుగెత్తుకొచ్చి, "ఇప్పుడేం జరుగబోతుంది?" అన్న కుతూహలంతో మా చుట్టూ దడికట్టి నిలుచున్నారు.

"అసలేంటిదంతా?" అన్న చిరాకు నాలో మొలకెత్తడం గమనించిన నా శ్రీమతి "మీరు కొంచెం ఓపిక పట్టండి" అన్నట్టు తన కుడిచేత్తో నా వీపు మీద మెల్లగా తిప్పింది.

"ఎక్కడో ఆంధ్రదేశంలో కరీంనగర్ జిల్లా, మంథని గ్రామం నుంచి నాలుగు తరాల కిందట ఇక్కడికొచ్చిన మా ముత్తాత శ్రీమాన్ అరుణాచార్యుల వారి నుంచి ఇప్పటివరకు ఎవ్వరికీ రాని చిత్రమైన సన్నివేశం ఈరోజు మాకెదురయ్యింది. మీ మౌనానికి కారణమేంటో? ఈ చర్యకు అర్థమేంటో వివరిస్తే, ఆపైన మేం ఏమిచేయాలో ఆలోచిస్తాం" గుసగుసలాడుతూ కూర్చున్న వాళ్ళను సౌమ్యంగా ప్రశ్నించాడు అరుణాచార్య.

మరికొంతసేపటి తరువాత కూర్చున్న వాళ్ళల్లో అందరికన్నా పెద్దవాడిలా ఉన్న ఓ వ్యక్తి ఆఖరుకు నోరు విప్పి "అసలు మహిళలు పిండ ప్రదానం చేయవచ్చా? ఓ మహిళతో కలిసి చేస్తే మేమంతా కూడా ఆ అనాచారాన్ని ప్రోత్సహించినట్టు కాదా?" అంటూ ఓ ధర్మ సందేహాన్ని వ్యక్తపరిచాడు అందరి తరఫునా.

అరుణాచార్యతో పాటు మాకూ విషయమేంటో

## ఆసుపత్రి

**చా**కిరేవు బండలపై దెబ్బల్లా
వీపుపై మోత
కాలికి గుచ్చుకున్న ముల్లులా గుండెలో సలుపు
రోదసిలో వాయుపీడనం తగ్గి
శ్వాస పీల్చడం కష్టమైనట్టుగా
రొమ్ములో శ్వాసాశ్వాసల ఎగరొప్పులు
ఏవో బాటిళ్ళ నుండి గొట్టాల ద్వారా
రక్తనాళాల్లోకి ఎక్కుతున్న ప్రాణధారలు
వీడ్కోలు పల్కడానికి స్టేషనుకు
వచ్చిన బంధుజనంలా/రోగుల పరామర్శకు వచ్చిన
మిత్రగణ కోలాహలం
వారిపై సిబ్బంది చిర్రుబుర్రులు
అనవసర ఉరుకులూ పరుగులూ
ఆసుపత్రిలో సజీవ చిత్రం
పుట్టినవారు ఎప్పటికైనా / గిట్టక తప్పదని తెలిసీ
జీవన ప్రవాహంలో వైద్యం గడ్డిపరక
ఆసరాగా ప్రాణం పట్టుకు వేళాడే మనిషి
డాక్టర్ల ప్రిస్కిప్షన్లు / మందుల షాపు బిల్లులు
నిపుణుల పరీక్షలు
అందరూ కుమ్మక్కై రోగుల దోపిడీ
రోగం నయమైతే వారి ప్రావీణ్యం
బెడిసికొడితే దైవేచ్ఛ అని
గీత బోధ చేసే డాక్టర్లు, అయినా
మేక కటికవాణ్ణి నమ్మినట్టు
డాక్టర్లపై ఆశలు పెంచుకునే సగటు మనిషి
ఆసుపత్రిలో అసహాయ రోగి!

**-అంబల్ల జనార్దన్**

## తల్లీ.. ఎవరు నీవు?

తడిస్తే తడవని
తడిక అడ్డుతొలగి
కలిసుండే సమయం వచ్చినప్పుడు!

కురిస్తే కురవని
కడగండ్ల నుండీ కారే
కన్నీటి బిందువులను తనలో కలుపుకొని
మరిపిస్తున్నప్పుడు!

ఈర్ష్యపడితే పడిపోనీ
అయ్యో అని కనికరిస్తే
కయ్యానికి కాలుదువ్వుతున్నప్పుడు!

ఒదిలితే వదిలిపోనీ
వగలాడి మాటలతో మోసగించి
మాయచేస్తున్నప్పుడు!

పగిలితే పగలని
కలిసుండే హృదయం వెయ్యివక్కలవ్వాలని
ఉబ'లాట' పడేటప్పుడు!

పారితే పారనీ
వృథాగా పోతున్న క'న్నీటి' బంధాలను
బందీ చెయ్యకుండా రోడ్లకెక్కిస్తున్నప్పుడు!
కానీ–
తెగులు పట్టించేలా
తల్లి మాటకి వక్రభాష్యం చెప్పకు
అది...
రగిలే మంటలకి మరింత ఆజ్యం పోసి
నీలాకాశంలోకి నల్లని పొగలు కమ్మించి
నిన్ను ఉక్కిరిబిక్కిరి చేయించి
కంటికి కనిపించని విధంగా
దహించి మింగేస్తుందది!?

–చలపాక ప్రకాశ్

అప్పుడు అర్థమయ్యింది.

అరుణాచార్యకు ఎడమవైపున మా అందరికీ అభిముఖంగా కూర్చుని మాతోపాటే పిండప్రదానం చేయడానికి సిద్ధమవుతున్న ఓ ఆడమనిషిని గురించే వీళ్ళంతా ఇంత యాగీ చేస్తున్నారని తెలిసిన క్షణంలో నా మనస్సెందుకో గాని అలవికాని అసహనానికి లోనయ్యింది.

అక్కడ కూర్చున్న ఆవిడకు ముప్పై ఐదేళ్లుంటాయి. మనిషి నలుపైనా ముఖంలో కళ ఉంది. మాలాగే నదిలో స్నానంచేసి వచ్చిందేమో వంటిమీద బట్టలు తడిసున్నాయి. వేసుకున్న జారుమడిలో నుంచి ఇంకా నీళ్ళు ఒడుస్తూనే ఉన్నాయి. మెడలో కాశీదారం, చేతులకు వెండి గాజులు ఆమె వైధవ్యాన్ని ఎత్తి చూపు తున్నాయి. కష్టంలో రాటుదేరిన శరీరం బలిష్టంగా కన్పిస్తుంది. ఆమె కూర్చున్న తీరు చూస్తుంటే తను కేవలం పిండప్రదానం చేయబోతున్న వ్యక్తిలా కాక ఓ క్రతువును నిర్వహించబోతున్న సోమిదమ్మలా అన్పిస్తుంది.

"ఓహో అదా విషయం. ఇందుకోసమా మీరింత కలకలం సృష్టించారిక్కడ! చూడండీ! నేనిక్కడికొచ్చింది పిండ ప్రదానం చేయించడానికి తప్ప, మీ ధర్మ సందేహాలు తీర్చడానికి కాదు. ఐనా, ఎవరిష్టం వారిది. ఎవరి కారణాలు వారివి. తను ఆడమనిషయ్యుండీ ఈ కార్యక్రమం కోసం ఇంత దూరం వచ్చిందంటే అందుకు కారణమేంటో మనకేం తెలుసు? మీకసలు శ్రాద్ధమంటే ఏంటో తెల్సా? శ్రద్ధతో పెట్టేదే శ్రాద్ధం. అది, ఆమెలో పుష్కలంగా కన్పిస్తుంది. ఆమెకా అర్హత చాలు. అవసరం లేని విషయాలతో కాలయాపన చేయక మీరొచ్చిన పని పూర్తిచేసుకుని వెళితే మంచిది." జారిపోతున్న వల్లెవాటును సర్దుకుంటూ చెప్పాడు అరుణాచార్య.

"అదేమిటి? కార్యక్రమం చేయించుకునే గృహస్తులకు సందేహం వచ్చినప్పుడు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మీమీద లేదా?" స్థానికంగా వస్తున్న తమ పౌరోహిత్యానికి ఎక్కడో తెలుగు నేల నుండి తరలి వచ్చిన వీళ్ళు గండికొట్టారన్న దుగ్ధను తమ అంత రాంతరాల్లో ఎక్కడో నివురుకప్పిన నిప్పులా దించుకున్న పాండాలంతా అందివచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకుంటూ అరుణాచార్యను ఇరుకున పెట్టడానికి పూనుకుంటూ మాట్లాడసాగారు.

పాండాలు ఉద్దేశ్యాన్ని గ్రహించిన అరుణాచార్య

"ఇదీ ఒకందుకు మంచికే వచ్చింది. మీ మీద వీళ్ళ మనసుల్లో ఎంత ద్వేషం గూడుకట్టుకున్నదో ఇవ్వాళ అర్థమైంది" అనుకుంటూ తనలో తనే పరిపరివిధాల ఆలోచన చేయసాగాడు.

"శాస్త్రం తెలిసిన వాళ్ళయ్యుండీ ఇలా అనాచారంగా ఓ ఆడమనిషితో పిండ ప్రదానం చేయించడం బాగోలేదు." పాండాలంతా ఒక్కుమ్మడిగా దాడికి సిద్ధమౌతూ రకరకాలుగా వ్యాఖ్యానించసాగారు.

వడగళ్ళ జడివానను కాచుకున్న కొబ్బరిచెట్టులా పాండాల వ్యాఖ్యలను తట్టుకుని నిలబడ్డ అరుణాచార్య చివరకో నిర్ణయం తీసుకున్నవాడిలా తలపంకిస్తూ "ఏమమ్మా! ఇంతకూ నీ పేరేమిటి?" అంటూ ఆ ఆడమనిషిని ప్రశ్నించాడు.

"మల్లమ్మ"

"మల్లమ్మా! విన్నావుగా. నువ్వు పిండప్రదానం చేయడమంటే ఆచారాన్ని తృణీకరించడమే అంటున్నారు ఈ పెద్దమనుషులు. దానికేమంటావ్?" మెడలో వేళ్ళాడుతున్న సెల్‌ఫోన్ని చేతిలోకి తీసుకుంటూ.

"ఆచారమో, అనాచారమో! అయన్నీ నాకు తెలియవు సామీ! నాకు తెలిసిందల్లా నా తల్లిదండ్రులకు పిండాలు పెట్టడమే. అడగటానికి వీళ్ళెవ్వరు. ఆడమనిషి పిండాలు పెట్టగూడదని ఎక్కడన్నా రాసుందా? ఎక్కడో కాని రాజ్యంలో కన్నోళ్ళిద్దరు ఆరు నెల్ల తేడాతో కాలంజేస్తే, కొరివిపెట్టాల్సిన తోడబుట్టినోళ్ళు రానేరామని తేల్చిచెబితే, ముందు నడిచి తలకొరివి పెట్టిన, మా నాయినకిచ్చిన ఆఖరి మాట కోసం వాళ్ళ అస్థికలు తీసుకొని ఇంతదూరమొచ్చిన. వీళ్ళ మాటలతో బెదిరిపొయ్యేదాన్ని కాను" ఓ తిరుగుబాటుకు ప్రతిరూపంలా మాట్లాడింది మల్లమ్మ.

మల్లమ్మ మాటలను విన్న అక్కడివాళ్ళంతా ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టారు.

"నువ్వొక్కదానివే ఇక్కడిదాకా వచ్చావంటేనే బలమైన కారణమేదో ఉంటుందనే అనుకున్నా. అదేంటో ఇప్పుడు వీళ్ళందరికీ వినిపించాల్సిన అవసరమొచ్చింది. విన్పించు మరి." సమస్యకు ఓ పరిష్కారాన్ని కనుగొనే క్రమంలో తెలివిగా మల్లమ్మను రంగంలోకి దించాడు ఆచార్య.

ఆచార్య మాటలు విన్న మల్లమ్మ మనసులో ఏ దుఃఖపు గాయాలు తిరగబెట్టాయో, ఏ జ్ఞాపకాలు రగిలించిన దివిటీలై జ్వలించాయో గాని మనిషి

# పిట్టల చెట్టు

**జెం**డా స్తంభం చేరువలో
దొరగారి బంగ్లా ముంగిట
అల్లదిగో పిట్టల చెట్టు
గగన విహారపు సయ్యాటలో
ఆటవిడుపుల
ఆకుపచ్చని కోవెల

రెక్కలొచ్చి వలసెళ్ళినపుడు
అనుబంధాలు నిరీక్షిస్తున్నట్లు
ఉదయకాలపు ఆకాశంలో
రెమ్మలపై అతి సుతారపు నడకల
వేల పిట్టల కనువిందు అక్కడ

ఎవరి పేరు రాసుందో
ఆ కొమ్మ మీద ఆ పిట్టే వాలింది
చిరునామాలపై నిలబడి
నిలయ విద్వాంసుల వాద్యగోష్ఠిలో
బృందంగా పాల్గొంటాయి.

అది నిరంతర చింతనల చింతచెట్టు
అధికారుల చూపులు గొడ్డళ్ళవ్వలేదు
చెట్టు కింద
సున్నం జల్లినట్టుగా ఉన్న
సామూహిక విసర్జనాల కంపును
నాసికారంధ్రాలు మెదడుకు
సంకేతాలు పంపలేదు
లేకుంటే తవ్వోడ చేతితో
పెకలించి పోగులెట్టేవారు.

చెట్టూ పిట్టా లేని
కాంక్రీటు మహావనంలో
ఇదొక్కటే దీపస్తంభమై నిలబడింది.

కనీసం చెట్టు చిరునామాకైనా
దీన్ని అలాగే ఉంచుదాం
లేదంటే ఇక అడవికి పరుగెట్టాలి.

–దాట్ల దేవదానం రాజు

అదోలాంటి భావోద్వేగానికి లోనవుతూ గతాన్ని వర్తమానీకరించుకుంటూ కళ్ళు మూసుకుంది.

❖ ❖ ❖

"తలచెడి ఇల్లుచేరిన ఆడపిల్ల మీద మమ్ముల్నిద్దర్నీ వదిలేసి, ఎవడి మానాన వాడు తిరుగుతుంటే ఎన్ని రోజులని చూసుకుంట ఉండాలి? ఇంగ మా వల్లగాకనే పెద్ద మనుషుల్ల బెట్టినం." కోదండ రామస్వామి ఆలయం ముందున్న వున్నాగ చెట్లకింద చేరిన ఊరిపెద్దలతో తమ కొడుకుల గురించి గోడు వెళ్ళబోసుకున్నారు వృద్ధులైన శ్యామలమ్మ, రత్నయ్య దంపతులు.

"అవునయా! కాడెద్దుల్లాంటి ఇద్దరన్నదమ్ములుండి ముసలోళ్ళను ఆడపిల్ల మీద వదిలెయ్యడమేంది?" పంచాయతీలో ఓ మూల కూర్చున్న రత్నయ్య, శ్యామలమ్మల కొడుకులను పరికించి చూస్తూ ప్రశ్నించాడు ప్రెసిడెంట్ మట్టారెడ్డి.

"ఎందుకొదిలేసినమో మీ అందరికి తెలియదా? పెనిమిటి పోయిండని పిల్లల్ని ఎమ్మటిబెట్టుకొని ఇల్లుచేరితే పోన్లే తోడబుట్టిందని ఉంటానికి పాతిల్లిచ్చినం. అది చాలదని ముసలోళ్ళిద్దరు కూడబలుక్కుని మాకు చెప్పకుండనే, వాళ్ళకు తీసుంచిన ఏనెల దగ్గర ఎకరం చేను బిడ్డ పేరు చేశారు. ఆ ఎకరం చేను ఎంతలేదన్నా ఇయ్యాల పది లక్షలు పలుకుతుంది. అంత ఆస్తి దక్కించుకున్న బిడ్డ ఆ మాత్రం ముసలోళ్ళను చూసుకోలేదా?

ఆ చేను గురించి మా పెళ్ళాం, పిల్లలు మమ్మల్ని చెండుకు తింటున్నారు. మేమెవరికి చెప్పుకోవాలి మరి!" అంటూ రత్నయ్య, శ్యామలమ్మల కొడుకులిద్దరూ ఒకరి తర్వాత ఒకరు వంతులు వేసుకుని మరీ చెప్పుకొచ్చారు.

కొడుకులు చెప్పిందంతా విన్న రత్నయ్య కోపంతో ఊగిపోతూ లేచి "కక్కిన కూటికి ఆశపడే కుక్కల కొడుకుల్లారా! ఏం మాట్లాడుతున్నారా? అది మగని ఆస్తి నాలుగు సెంట్ల ఇంటి స్థలం అమ్మికొచ్చి ఐదువేలు మన చేతుల్లో పోస్తే... అప్పటి రేటు ప్రకారం ఆ ఎకరం నేల మనం కాదా చూసిచ్చింది. ఇయ్యాల దాని అదృష్టమో, దాని పిల్లల అదృష్టమో భూమి రేటు పెరిగింది. దాంతో ఆశబుట్టి మీకేదో చెప్పకుండా ఇచ్చామన్నట్టు మాట్లాడ్తూ తోడబుట్టిన దానికి అన్యాయం జెయ్యాలని జూస్తా్రా!

మీకేం తక్కువజేశాం? మీకూ చెరో ఐదెకరాలు పంచియ్యలేదా? ఐనా ఇప్పుడు మేమడుగుతుంది రెక్కలుడిగిన మా సంగతేందని? దానికి సమాధానం చెప్పకుండా ఏదో తెచ్చి అడ్డంబెడతారేంది?" చేతిలోని పట్టుడు కర్రను నేలమీద తాటిస్తూ అన్నాడు.

"అయ్యన్ని గాదు, ముందా ఎకరం చేనమ్మండి. వచ్చిందాంట్లో సగం మాకిస్తే మిమ్మల్ని మే జూస్తం. లేకుంటే లేదు" ఒకే గొంతుకతో చెప్పారు అన్నదమ్ము లిద్దరు.

"అంతేనా?"

"అంతే"

"రెడ్డిగారూ! ఇంటున్నారుగా! మాట్లాడండి" అన్నాడు రత్నయ్య ప్రెసిడెంట్ మట్టారెడ్డితో.

"వాళ్ళొట్టి మూర్ఖులు, వాళ్ళు చెప్పిందే తప్ప, ఎదుటోళ్ళు చెప్పింది విన్పించుకోరు" అనుకున్న

## తెలుగు భాష అమరం!

శబ్దాలా నాదాలు
అక్షరాలుగ గుర్తించి
మాటలెన్నో అల్లుకుని
పాటలుగా పాడుకుంటు
తెలుగు భాష పుట్టింట్లో
సుస్వరాల గానమై
తెలుగు జాతి లోగిల్లో
పరిమళాల కవితనైతి!

ఓంకారపు నాదమే తెలుగు భాషకు మూలమై
అక్షరాల ప్రకృతియే పలుకులకు నిలయమై
మధురాల మాటలెన్నో తేనె జల్లుల్లా రాల్చే
పెదవుల్లో ఆ పలుకులు చెఱకు గడల రసాలూరే
పెరుగు, వెన్న, నెయ్యిలా నాలుకపై కరిగిపోగా
తెలుగు భాష వెల్లువలా ప్రజలనోట పల్లవించే!

॥శబ్దాలా॥

జగతిభాషలందు కనుమ అకారాల, ఇకారాల, ఉకారాల, ఎకారాలు
తెలుగు భాష మూలాలే! ఆది భాష మనదేలే
తెలుగుకున్న తెగువ అది లోక భాషలకెప్పుడో
ఉచ్చారణ ధారపోసి గొప్పదనం చాటుకునే!
తరాలెన్నో మారుతున్నా భాషలన్నీ నశిస్తున్నా
తెలుగు భాష జగతిలో దివ్యతేజమై వెలుగు

॥శబ్దాలా॥

-ఆకుల రాఘవ

పెద్దమనుషులెవ్వరూ నోరు విప్పలేదు.

దాంతో దుఃఖం ఉప్పెనలా ఎగదన్నుకొస్తుంటే వల వలా ఏడ్చుకుంటూ లేచి "ఇక్కడింతమంది కూర్చు న్నారు. కానీ, ఒక్కళ్ళన్న మంచి, చెడు అన్నాళ్ళు లేరు. నా రాత బాగోక వచ్చి వీళ్ళ పంచన చేరినందుకు ఇంత అన్యాయంగా మాట్లాడుతున్నారు. పోన్లే వాళ్ళ భూమిని వాళ్ళనే ఉంచుకోమనండి. నా రెక్కల్లో మూలగున్నంత సేవ యాణ్ణోచోట ఇంత కష్టంజేసుకోని నా పిల్లలకింత తిండి పెట్టుకోలేకపోతానా?" అంటూ మాట్లాడింది.

కూతురు మాటలు విన్న రత్నయ్య దంపతులు ఒక్కసారిగా ఆమెను పొదివి పట్టుకుంటూ "ఏడవకమ్మా! ఏడవకు. నువ్వెక్కడుంటే మేమక్కడే. బతుకైనా, సావైనా నీతోనే. మాకీ కొడుకులొద్దు. ఆ భూములొద్దు" అంటూ వాళ్ళూ వలవలా ఏడ్చుకుంటూ కుప్పగూలిపోయారు.

ముసలివాళ్ళ ఏడుపుతో అక్కడంతా గంభీరంగా మారిపోవడంతో అప్పటిదాకా మౌనంగా కూర్చున్న పెద్దమనుషులంతా "చూడు రత్నయ్య మామా! మీరియ్యాళ్ళ కొడుకుల మీద కోపంతో తెగదెంపులు చేసుకుందామన్నా తెగే బంధం గాదు మీది. రేపోనాటికి మీరు చస్తే తలకొరివి పెట్టి, శూతకం పట్టి, మూతి మీసాలు గొరిగించుకోవాల్సినోళ్ళు వాళ్ళేగదా! ఈ వయసులో వాళ్ళతో పంతమెందుకు? వాళ్ళన్నట్టే ఆ భూమేదో అమ్మి వాళ్ళకు చెరో ఇంత ఇస్తే అన్నీ సర్దుకుంటాయి గదా! అప్పుడు చచ్చినట్టు వాళ్ళే మీకో ముద్దబెడతారు" అంటూ కలుగజేసుకొని తలోరీతిగా చెప్పుకొచ్చారు.

పెద్దమనుషుల మాటలకు మరింత నొచ్చుకుంటూ "రేపు వీళ్ళు తలకొరివి బెట్టంగనే మేం లేచి కూసుంటమా? వాళ్ళకక్కావాల్సింది సొమ్ముగాని కన్నోళ్ళు గాదు. తోడబుట్టింది గాదు. ఈ ఊరే వదిలిపెట్టి పోతున్న మాకు ఇంక కొడుకుల్తో పనేముంది? రేపు మేమెక్కడన్న చచ్చినా వీళ్ళకు కబురు రాదు. ఒకేళ మీకు దగ్గోళ్ళెవరన్న చెప్పినా వీళ్ళొచ్చి మా పాడె పట్టొద్దు. తలకొరివి పెట్టొద్దు. మాకేజ్జేసినా మా కూతురేజెయ్యాల. అదిజేస్తేనే మా ఆత్మలు నిమ్మళపడతై" తమ మనసులోని మాటను స్పష్టంగా చెప్పారు రత్నయ్య దంపతులిద్దరు.

తల్లిదండ్రుల మాటలను విన్న మల్లమ్మ ఏడుస్తూ "ఏనాడూ నలుగుర్లోకి రాని మా అమ్మా, నాయినలు

## కవిత

మమతల రాగాలు, ఆ తీరాలు
మధుర స్మృతులు, ఆ మందహాసాలు
సుందర మందిరాలు, అనంత శయనాలు
కామాంధుల కంత్రీగలు ఆ కందకాలు
చేష్టలుడిగి అచేతనావస్థలు, ఆ విద్యా భవనాలు
భ్రష్టత కేకలు వేస్తుంది బారులు చాచి
ఇది పోవాలి అది రావాలి కాలగర్భాన
కలిసిపోవాలి మలినములన్నీ
నదీమతల్లులై 'నది'నదులై
నైర్మల్యం పొందాలి

-వాస్తు రామచంద్ర

ఇయ్యాల మీ ముందుకొచ్చి న్యాయం కోసం చేతులు చాస్తే న్యాయం జెయ్య చేతగాక సుద్దులు జెపుతున్నారు. అన్నింటికి అగో! ఆ గుళ్ళోని దేవుడే ఉన్నాడు. వాడే న్యాయం జేస్తాడు" అంటూ ఊరిపెద్దలు చూస్తుండగానే తను కన్నవాళ్ళను, తనను కన్నవాళ్ళనూ వెంటబెట్టుకొని ఊరు పొలిమేరలు దాటింది.

❖ ❖ ❖

మల్లమ్మ చెప్పడం ముగించేసరికి, అప్పటిదాకా అరుణాచార్యను ఏదో చేయాలని చూసిన స్థానిక పాండాలంతా చప్పుడు కాకుండా ఒక్కొక్కళ్ళే అక్కణ్ణుంచి మెల్లగా జారుకోవడం మొదలుపెట్టారు.

మల్లమ్మ విషయంలో సందేహాన్ని లేవదీసిన వాళ్ళంతా సిగ్గుతో తలలు దించుకున్నారు.

అరుణాచార్య కళ్ళవెంట సానుభూతి వర్షిస్తుంటే, "చూడు మల్లమ్మా! ఆ నదిలాంటి బిడ్డను కన్న నీ తల్లిదండ్రులు నిజంగా ధన్యజీవులు. ఇంతసేపు ఇక్కడ నిల్చున్న ఈ పాండాలే కాదు, మొత్తం గయా క్షేత్రమే ఏకమై వచ్చినా ఫరవాలేదు గాని నీతో మాత్రం పిండ ప్రదానం చేయిస్తాను" అన్నాడు.

ఆయన నిర్ణయంతో వులకించిపోయిన ఫల్గుణీ నది ఆనందంతో 'బుద్ధగయ' వైపు పరుగులు తీసింది.

గోమాతలు 'అంబా'రవాలతో మల్లమ్మను ఆశీర్వదిస్తూ ఆనందంతో గంతులు వేశాయి.

రావిచెట్టు హృదయోల్లాసంగా ఊగిపోతూ కొమ్మల చేతులతో వింజామర వీవసాగింది.

ఆ చెట్టు మీద కోకిల దిక్కులు పిక్కటిల్లేలా పంచమ శృతిలో అభ్యుదయ గీతాన్ని ఆలపించ సాగింది. ■